జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
శుక్రవారం
22-05-2026
సంపుటి 1 సంచిక 179
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195

విలేకరులు కావలెను
నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ ఆర్.సి.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ క్రైమ్ రిపోర్టర్లు
7337546647
(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)



## జూన్ 2 నుంచి మద్యం ధరల పెంపు

**10 శాతం నుంచి 15 శాతం వరకు ధరలు పెంచేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ చర్యలు**

**దశ, హైదరాబాద్:** రాష్ట్రంలో మందుబాబులకు భారీ షాక్ తగిలే సూచనలు కనిపిస్తున్నాయి. జూన్ 2 తర్వాత మద్యం ధరలు పెంచేందుకు సర్కార్ కసరత్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రక్రియ పూర్తి అయినట్లు సమాచారం. మద్యం ధరల పెంపునకు సంబంధించి.. ఇప్పటికే కమిటీ సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్లు తెలుస్తోంది. మరోవైపు.. మద్యం తయారీ కంపెనీల నుంచి వస్తున్న ఒత్తిడి నేపథ్యంలో ధరలు పెంచక తప్పని పరిస్థితి నెలకొంది. కమిటీ సిఫార్సుల కంటే తక్కువగానే ప్రభుత్వం ధరలు పెంచనుంది. ఇప్పటికే కమర్షియల్ గ్యాస్ ధరలు దాదాపు రెట్టింపు కావడంతో సీసాల తయారీ ఖర్చు 15 శాతం నుంచి 20 శాతం వరకు పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో వాటికి అనుగుణంగా

..మిగతా 4వ పేజీలో →

## కార్మికులకు వేతనాలు పెంపు

**పెంపుతో 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు**

**జూన్ 1వ తేదీ నుంచి అమల్లోకి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**




**దశ, హైదరాబాద్:** తెలంగాణ కార్మికులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. కార్మికుల కనీస వేతనాలను పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ వేతనాల పెంపు కోసం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తీసుకున్న నిర్ణయాలను సీఎం స్వయంగా వివరించారు. ఇక వేతనాల పెంపుతో 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు కలుగుతుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. మూడు కేటగిరీలుగా కార్మికులను విభజించి.. వేతనలు పెంచినట్లు తెలిపారు. రాష్ట్రంలోని కార్మికులకు రేవంత్ రెడ్డి సర్కార్ వరాల జల్లు కురిపించింది. వారికి అందే కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ వేతనాల పెంపు జూన్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారు. ఈ నిర్ణయంతో తెలంగాణలోని 1.11 కోట్ల మంది కార్మికులకు లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి మీడియా సమావేశం నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి.. కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయాలను, విధివిధానాలను వివరించారు. ఇక రాష్ట్రంలోని కార్మికులను ప్రభుత్వం మూడు జోన్లుగా విభజించింది. కార్పొరేషన్ల పరిధిలో ఉండే కార్మికులను గ్రేడ్ 1గా.. మున్సిపాలిటీ పరిధిలో ఉండే కార్మికులను గ్రేడ్ 2గా.. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే కార్మికులను గ్రేడ్ 3గా పేర్కొంది.ఇక అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హై స్కిల్డ్

..మిగతా 4వ పేజీలో →

## కొత్త పెన్షన్ల పంపిణీకి ముహూర్తం

**నూతనంగా 2లక్షల మందికి పింఛన్లు మంజూరు కోసం బడ్జెట్‌లో కేటాయింపులు**

**దశ, హైదరాబాద్;** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది కొత్త పెన్షన్లు,ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్న వారికి తీపి కబురు అందించింది. ఇప్పటికే వీటి కోసం దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తున్న వారి సంఖ్య గణనీయంగా ఉంది. కాగా, బడ్జెట్ లో ఇప్పటి కే ప్రకటించిన రెండు లక్షల పెన్షన్ల తో పాటుగా రేషన్

..మిగతా 4వ పేజీలో →



## తెలంగాణ.. అగ్నిగుండం

**మండుతున్న ఎండలు.. రెడ్ అలర్ట్ జారీ**

**19 జిల్లాల్లో 45.9 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**

**ఎండవేడికి ప్రమాదాలు.. అకాల వర్షాలు.**

**దశ , హైదరాబాద్:** తెలంగాణ అగ్నిగుండంలా మారుతోంది. రాష్ట్రంలో ఎండల తీవ్రత ప్రమాదకర స్థాయికి చేరింది. గురువారం నుంచి ఉష్ణోగ్రతలు మరింత పెరిగి 47 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మంగళవారం వడదెబ్బ కారణంగా రాష్ట్రంలో నలుగురు మృతి చెందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏకంగా 19 జిల్లాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఎండ తీవ్రతకు నిదర్శనంగా నిలుస్తోంది. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్‌లో అత్యధికంగా 45.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. నల్గొండ, నిర్మల్, సిద్దిపేట, మంచిర్యాల, పెద్దపల్లి, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, సిరిసిల్ల, ఆసిఫాబాద్ జిల్లాల్లో అనేకచోట్ల 45 డిగ్రీల మార్కును దాటింది. హన్మకొండ,

..మిగతా 4వ పేజీలో →

**వడదెబ్బ.. తెలుగు రాష్ట్రాల్లో ఒక్కరోజే 9 మంది మృతి**

4లో



## దేశానికి దిశ, దశ చూపించిన గొప్ప నాయకుడు

**రాజీవ్ గాంధీకి సీఎం రేవంత్ నివాళులు**

**దశ, హైదరాబాద్:** మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి స్ఫూర్తితో తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం ఎదురుగా ఉన్న ఆ మహానేత విగ్రహానికి ముఖ్యమంత్రి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. 21వ శతాబ్దంలో దేశాన్ని కంప్యూటర్ యుగం వైపు నడిపించి ఒక దశ, దిశ చూపించిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని గుర్తుచేశారు. సాంకేతిక యుగం వైపు దేశ యువతను సన్నద్ధం చేసిన నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సలహాదారు వి హనుమంతరావు తో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## సరస్వతి అంత్య పుష్కరాలు ప్రారంభం

**దశ, భూపాలపల్లి:** సరస్వతి అంత్య పుష్కరాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పుష్కరాల తొలి రోజు గురువారం ఉదయం 5.43 గంటలకు పవిత్ర సంగంలో తొలి పుష్కర స్నానం నిర్వహించారు. ఈ పుణ్యస్నానాన్ని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వాములు, ఐటి పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతులు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ధార్మిక సలహాదారు గోవింద హరి తదితరులు ఆచరించారు. అలాగే భూపాలపల్లి, రంగారెడ్డి నియోజకవర్గాల శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, మల్ రెడ్డి రంగారెడ్డి పుష్కర స్నానంలో పాల్గొన్నారు. పుష్కరాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. భద్రత, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, రవాణా వంటి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ పుణ్యకాలంలో భక్తులు సౌకర్యవంతంగా, సురక్షితంగా పుష్కర స్నానాలు నిర్వహించుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.

## తెలంగాణలో నకిలీ క్లినిక్ లు

**అనుభవమే అర్హతగా అల్లోపతి వైద్యం**


**నకిలీ వైద్యుల్లో 80 శాతం మంది ఒక్క గ్రేటర్ హైదరాబాద్‌లోనే**



**దశ, హైదరాబాద్:** సరైన వైద్య పట్టా లేకుండా, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ మున్నాభాయ్‌లపై చర్యలు తీసుకోవడంలో వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 600 ఎఫ్ఐఆర్‌లు నమోదైనప్పటికీ, తదుపరి కార్యాచరణ ముందుకు సాగకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న క్లినిక్‌లపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నా, ఉన్నతాధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. నకిలీ వైద్యుల్లో 80 శాతం మంది ఒక్క గ్రేటర్ హైదరాబాద్‌లోనే ఉండటం గమనార్హం. ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే 200లకు పైగా కేసులు నమోదైనా, చర్యలు శూన్యం కావడంతో టీజీఎంసీ ఇప్పుడు హైకోర్టులో పిల్ వేసేందుకు సిద్ధమవుతోంది. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోనూ నకిలీ క్లినిక్‌లు భారీగా

..మిగతా 4వ పేజీలో →

## హైదరాబాద్లో మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్



**దశ, హైదరాబాద్:** దుండిగల్ లో ఒక మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్ జరిగింది. నిందితులు వీడియోలు తీసి పలుమార్లు బాలికను బ్లాక్మెయిల్ చేసారు. దుండిగల్ ప్రాంతంలో డబుల్ బెడ్ రూం ఇండ్ల సమీపంలోని ఓ షామియానా దుకాణంలో పనిచేస్తూ రోజూ అటు

..మిగతా 4వ పేజీలో →

జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
శుక్రవారం
22-05-2026
స్టేట్ న్యూస్
WWW.DASHANEWS.COM

# DGP సీవీ ఆనంద్‌ని కలిసిన పృధ్వీ చౌదరి

**దశ, ఖమ్మం :** తెలంగాణ DGP సీవీ ఆనంద్‌ని గురువారం TPCC జనరల్ సెక్రటరీ పృధ్వీ చౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన డీజీపీ పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమాజంలో యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సీవీ ఆనంద్ అన్నారని పృధ్వీ చౌదరి తెలిపారు. హైదరాబాద్ సిటీ మొత్తం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో యువతను అవగాహన పర్చేందుకు, డ్రగ్స్ వాడకంపై ప్రతి సర్కిల్‌లో ప్రచారం చేయనున్నట్లు ఈ సందర్భంగా పృధ్వీ సీవీ ఆనంద్‌కు తెలిపారు. ఆ కార్యక్రమాలకు పోలీస్ శాఖ తరుపున పూర్తి సహకారం ఉంటుందని డీజీపీ హామీ ఇచ్చారు. యువత ముందడుగు వేస్తేనే అనేక అంశాలు ప్రచారం అవుతాయని, విద్యార్థి దశనుండే అవగాహన కల్పించడం ద్వారా సమాజంలో భారీ మార్పులు వస్తాయని అభిప్రాయపడ్డారు.







# మేస్త్రీలకు హఠావో.. సెంట్రింగ్ కాంట్రాక్టర్లకు బచావో

## 5వ రోజు చేరిన నిరసన కార్యక్రమాలు

నాచారం చౌరస్తాలో వంట వార్పు చేస్తూ నిరసన వ్యక్తం..

నేడు ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద సెంట్రింగ్ కాంట్రాక్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా ధర్నా..

**దశ ఓయూ:** రేట్లు పెంచాలని గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ డిమాండ్.. నాచారం జోన్ సెంట్రింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వంటావార్పు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.10 ఫీట్ల ఎత్తు జాక్ సెంట్రింగ్కు ఎస్.ఎఫ్.టి కి రూ.51 అమలు చేయాలి ప్రతి అంతస్తుకు 10 శాతం లిఫ్టింగ్ ఛార్జీలు ఇవ్వాలి బిల్డర్లు, గృహనిర్మాణదారులు సెంట్రింగ్ కాంట్రాక్టర్లతో నేరుగా ఒప్పందాలు చేసుకోవాలి. హైదరాబాద్ ఎస్టేట్ నాచారం తాపీ మేస్త్రీల మధ్యవర్తిత్వాన్ని తొలగించాలి సెంట్రింగ్ కాంట్రాక్టర్లను ఆర్థికంగా దెబ్బతీస్తున్న మధ్యవర్తుల వ్యవస్థను రద్దు చేసి, సెంట్రింగ్ పనులకు తగిన రేట్లు అమలు చేయాలని గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. "తాపీ మేస్త్రీలకు హఠావోడ సెంట్రింగ్ కాంట్రాక్టర్లకు బచావో" అనే నినాదంతో అసోసియేషన్ నాయకులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ నాయకులు రత్లవత్ రాములు నాయక్, సంఘముల శ్రీనివాస్ కుర్మ (వైస్ ప్రెసిడెంట్), వి. సంతోష్ నాయక్, దేవేందర్, శేఖర్, రమేష్, మధు, లక్ష్మణ్ ఠాగూర్ తదితరులు మాట్లాడుతూ 2016లో సెంట్రింగ్ పనులకు ఎస్.ఎఫ్.టి కి రూ.40గా నిర్ణయించామని, ప్రతి సంవత్సరం ఒక రూపాయి చొప్పున పెంచాలని తీర్మానించినప్పటికీ ఇప్పటివరకు అమలు కాలేదని తెలిపారు. ప్రస్తుతం ఉన్న రేట్లు కూడా తీవ్రంగా పడిపోయి కాంట్రాక్టర్లు నష్టాల్లో కూరుకుపోయారని పేర్కొన్నారు. మొలలు, చెక్కలు, వాల్ ప్లేట్లు, ట్రాన్స్పోర్ట్, లోడింగ్ అన్లోడింగ్ ఖర్చులు, కార్మికుల కూలీలు భారీగా పెరిగినా సెంట్రింగ్ రేట్లు పెరగకపోవడం అన్యాయమని ఆరోపించారు. లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి వర్కర్లకు అడ్వాన్స్లు ఇచ్చి పని చేస్తున్న కాంట్రాక్టర్లు కుటుంబాలను పోషించుకోవడమే కష్టంగా మారిందన్నారు. తాపీ మేస్త్రీలు సెంట్రింగ్ పనులను తమ రేట్లలో కలుపుకొని మాట్లాడటం వల్లే సెంట్రింగ్ కాంట్రాక్టర్ల రేట్లు దిగజారుతున్నాయని సంఘం ఆరోపించింది. ఎలక్ట్రిషియన్, ప్లంబర్, కార్పెంటర్లతో బిల్డర్లు నేరుగా ఒప్పందాలు చేసుకున్నట్లే సెంట్రింగ్ కాంట్రాక్టర్లతో కూడా డైరెక్ట్ మాట్లాడాలని కోరారు. సెంట్రింగ్ పనులు పెట్టుబడితో కూడుకున్నవని, నైపుణ్యం కలిగిన కార్మికులు అవసరమవుతారని, మేస్త్రీలు మధ్యవర్తులుగా వ్యవహరించడం వల్ల బిల్డర్లు మరియు కాంట్రాక్టర్లిద్దరికీ నష్టం జరుగుతోందని తెలిపారు. సెంట్రింగ్ కాంట్రాక్టర్లు నేరుగా బిల్డర్లు, గృహనిర్మాణదారులతో ఒప్పందాలు చేసుకుంటే రేట్లు లిఫ్టింగ్ ఛార్జీలు, ట్రాన్స్పోర్ట్ అంశాల్లో స్పష్టత తగ్గకుండా ఉండటంతో పాటు మెటీరియల్ భద్రత, ఉంటుందని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకువచ్చి భవన నిర్మాణాలు చేస్తున్నామని, ప్రస్తుతం చాలామంది సెంట్రింగ్ కాంట్రాక్టర్లు తమ మెటీరియల్ను స్క్రాప్కు అమ్ముకొని ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లుగా మారిపోతున్న దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి శ్రీకారం



## రూ.3 కోట్లతో పలు పనులకు శంకుస్థాపన

**దశ, పెద్ద అంబర్ పేట :** నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ఉన్న కాలనీలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడం తమ ప్రాధాన్యత అని ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి తెలిపారు. పెద్ద అంబర్పేట డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. సుమారు రూ.3 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ పనులకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూరహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, స్ట్రీట్ లైటింగ్ వంటి ప్రాథమిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోట్లాది రూపాయలను ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నామని, ప్రతి కాలనీ అభివృద్ధి చెందేలా దశలవారీగా పనులు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులు నాణ్యతతో, సమయానికి పూర్తి కావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజలు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే ప్రాంతీయ ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నాగోల్ సర్కిల్ డిసి నిత్యానంద్, నాయకులు సిద్ధంకిక్రిష్ణారెడ్డి ,పసుల రాజేందర్, గ్యారల శ్రీనివాస్ గౌడ్, పండుగల రాజు, విజయేందర్ రెడ్డి , బద్దం రామకృష్ణారెడ్డి ,మల్లికార్జున్ రావు, చెరుకు జగన్, పాలడుగు నాగార్జున ,దండెం రాజశేఖర్ రెడ్డి , గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ.. అగ్నిగుండం

**మొదటి పేజీ తరువాయి**

ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి వంటి జిల్లాల్లో 4445 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. హైదరాబాద్ నగరంలోనూ ఎండ తీవ్రత 43 డిగ్రీలకు చేరింది.రానున్న రెండు రోజులు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, వరంగల్, జనగామ, భూపాలపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 4547 డిగ్రీల మధ్య నమోదవుతాయని, ప్రజలు మధ్యాహ్నం వేళ ఇళ్లకే పరిమితం కావాలని సూచించింది. మరోవైపు నిజామాబాద్ జిల్లాలోని అన్ని మండలాల్లో మంగళవారం 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవడంతో అక్కడ కూడా రెడ్ అలర్ట్ జారీ చేశారు.

### ఎండవేడికి ప్రమాదాలు.. అకాల వర్షాలు.

ఎండల తీవ్రతకు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఓ కారు ఇంజిన్‌లో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. మరోవైపు, కొన్ని ప్రాంతాల్లో అకాల వర్షాలు, గాలివాన బీభత్సం సృష్టించాయి. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలో గాలివానకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లో గాలి దుమారానికి ఇళ్లపై రేకులు ఎగిరిపడ్డాయి. మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ అకాల వర్షం కురిసింది.

### వడదెబ్బ.. తెలుగు రాష్ట్రాల్లో ఒక్కరోజే 9 మంది మృతి

**దశ, హైద్రాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. నిన్న రాష్ట్రంలోని 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవగా, నిర్మల్ జిల్లా దిలావర్పూర్లో అత్యధికంగా 46.5 డిగ్రీల టెంపరేచర్ రికార్డయింది. తీవ్ర వడదెబ్బకు గురై ఒక్కరోజే తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో నాలుగైదు రోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగుతుందని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఖమ్మం, నల్గొండ, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు.



# జూన్ 2 నుంచి మద్యం ధరల పెంపు

**మొదటి పేజీ తరువాయి**

ధరలను పెంచాలని కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.ఇక అన్ని మద్యం బ్రాండ్లపై కనీసం 10 శాతం నుంచి 15 శాతం వరకు ధరలు పెంచేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ చర్యలు చేపడుతోంది. దీంతో సాధారణ, మీడియం బ్రాండ్లతో పాటు ప్రీమియం బ్రాండ్ల మద్యం ధరలు కూడా భారీగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక పెంచిన మద్యం ధరల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు అదనంగా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ఆర్థిక, అబ్కారీ శాఖలు చర్యలు తీసుకుంటున్నాయి. మరోవైపు.. మద్యం ధరల పెంపు , ఆదాయ వనరులకు సంబంధించిన అధ్యయనం చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం గతంలోనే ఒక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయగా.. ఆ కమిటీ ఇప్పటికే సర్కార్‌కు కీలక ప్రతిపాదనలు అందించింది. ఈ నేపత్యంలోనే ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న మద్యం ధరలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణలో ఏకంగా 25 శాతం నుంచి 30 శాతం వరకు పెంచవచ్చని.. ఆ త్రిసభ్య కమిటీ సర్కార్‌కు సిఫార్సు చేసినట్లు సమాచారం. అయితే ఒకేసారి అంత పెంచితే.. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని భావిస్తున్న ప్రభుత్వం.. 10 నుంచి 15 శాతం వరకు మాత్రమే ధరలను పెంచాలని అధికారులు పేర్కొంటున్నారు.

# కార్మికులకు వేతనాలు పెంపు

**మొదటి పేజీ తరువాయి**

అంటూ నాలుగు కేటగిరీలుగా కార్మికులను విభజించి వారికి కనీస వేతనాలను పెంచుతున్నట్లు చెప్పారు. జోన్ 1లో కనీస వేతనం ప్రస్తుతం రూ.12,750 ఉండగా.. దాన్ని రూ.16 వేలకు పెంచారు. ఇక స్కిల్డ్ కార్మికులకు రూ.13,772 గా ఉన్న జీతాలను రూ.18,500లకు పెంచారు. ఇక జోన్ 1లో సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ.13,592 నుంచి రూ.17000 పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని పనిని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో చేసి చూపించిందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలోని కార్మికుల సంక్షేమానికి తమ సర్కార్ కట్టుబడి ఉందని తేల్చి చెప్పారు. బీఆర్ఎస్ సర్కార్ రాష్ట్రంలోని కార్మికులను పట్టించుకోలేదని మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే.. కార్మికుల కనీస వేతనాలపై సబ్‌కమిటీని వేసినట్లు చెప్పారు. దీంతో కోటి 11 లక్షల మందికి మేలు జరుగుతుందని వివరించారు.

# కొత్త పెన్షన్ల పంపిణీకి ముహూర్తం

**మొదటి పేజీ తరువాయి**

కార్డుల పంపిణీకి ప్రభుత్వం ముహూర్తం నిర్ణయించింది. దరఖాస్తులు అర్హతల పైనా నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో ప్రభుత్వం వీటికి సంబంధించి మరో ముఖ్య నిర్ణయంతో ముందుకు వెళ్తోంది. తెలంగాణలో కొత్త పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డుల కోసం వేచి చూస్తున్న లబ్దిదారులకు ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2 నుంచి రెండు లక్షల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ ప్రకటించారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో నూతనంగా 2లక్షల మందికి పింఛన్లు మంజూరు కోసం బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయని పేర్కొన్నారు.

# హైదరాబాద్లో మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్

**మొదటి పేజీ తరువాయి**

వైపు నుండి వెళ్తున్న బాలికపై శివకుమార్ అలియాస్ మట్టు(20) అనే యువకుడు కన్నేసాడు. ఒకరోజు బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్నసమయం చూసి ఆమెపై అత్యాచారానికి పాల్పడి, ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించాడు. బాలిక మౌనంగా ఉండడాన్ని అదునుగా చేసుకుని తన స్నేహితుడు నిజాంపేట రాము(30)తో కలిసి బాలికపై అత్యాచారానికి పాల్పడి, ఫొటోలు వీడియోలు తీసి, ఎప్పుడు పిలిస్తే అప్పుడు రావాలని బెదిరించాడు. దీంతో నిందితుల నుండి వరుస వేదింపులు తాళలేక తల్లిదండ్రులకు బాలిక జరిగిన దుర్ఘటన గురించి వివరించింది. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితులను రిమాండుకు తరలించారు.

# తెలంగాణలో నకిలీ క్లినిక్ లు

**మొదటి పేజీ తరువాయి**

వెలిశాయి. కొందరు ఆసుపత్రుల్లో సహాయకులుగా పనిచేసి, ఆ అనుభవంతో ఏకంగా క్లినిక్‌లు నడుపుతుండగా.. మరికొందరు హోమియోపతి చదివి అల్లోపతి వైద్యం చేస్తున్నారు. ఇంకొందరు ఆర్ఎంపీలుగా పనిచేస్తూ ఏకంగా 1015 పడకల ఆసుపత్రులనే నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో తేలింది. వీరు అవసరం లేకున్నా అధిక మోతాదులో యాంటీబయోటిక్స్, పెయిన్ కిల్లర్స్, స్టెరాయిడ్స్ వంటి మందులు ఇస్తూ రోగుల మూత్రపిండాలు, ఇతర అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నారు.తెలంగాణ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ చట్టం , నేషనల్ మెడికల్ కమిషన్ చట్టం సెక్షన్లు 34, 35 ప్రకారం నకిలీ వైద్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పోలీసుల సహకారంతో క్లినిక్‌లను సీజ్ చేసే అధికారం ఉన్నా, క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. అధికారులు తనిఖీలు చేసినప్పుడు క్లినిక్‌లు మూసివేసి, కొద్దిరోజుల తర్వాత మరో పేరుతో మళ్లీ దందాను మొదలుపెడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్న ఈ నకిలీ వైద్యులపై తక్షణమే ఉక్కుపాదం మోపాలని వైద్య నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

**మొత్తం తనిఖీ చేసిన క్లినిక్‌లు:** 1200
**నకిలీవిగా తేలిన క్లినిక్‌లు:** 800
**నమోదైన ఎఫ్ఐఆర్‌లు:** 600

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com